

మొక్కను నాటుతున్న వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి తదితరులు

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

మన్సూరాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతోనే పర్యావరణం పరిరక్షింపబడుతోందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు మన్సూరాబాద్ డివిజన్ వివేకానందనగర్ కాలనీలో శుక్రవారం డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంగారెడ్డి ఆధ్వర్యంలో 'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి విచ్చేసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు నందికొండ గీతారెడ్డి, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ శ్రీరాంరెడ్డి, బీజేపీ మహిళా మోర్చా, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

నాగోల్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌కాలనీలో..

ప్రధాని మోదీ పిలుపు మేరకు 'అమ్మ పేరుతో ఒక మొక్క'లో భాగంగా నాగోల్ డివిజన్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌కాలనీలో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్, పంగ శ్రీకాంత్, పాల్వాయి సంజీవరెడ్డి, దయాకర్‌రెడ్డి, నూకల పద్మారెడ్డి, రాజు పాల్గొన్నారు.

చెప్పినట్టే అభివృద్ధి చేసి చూపిస్తున్నాం: కార్పొరేటర్

హయత్‌నగర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ ప్రజలకు చెప్పినట్లుగానే అభివృద్ధి చేసి చూపించడం జరుగుతుందని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లోని వినాయకనగర్‌కాలనీలో రోడ్డు లోతట్టుగా ఉండడం వల్ల వర్షం నీరు రోడ్డుమీద నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు కలుగుతుండడంతో కొత్త రోడ్డును మంజూరు చేయించారు. శుక్రవారం స్థానిక కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి రోడ్డు నంబర్ 29,30,31లో నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించారు. నీరు నిలిచే ప్రాంతాన్ని గుర్తించి రూ.55లక్షలతో కొత్తరోడ్డు నిర్మాణం పనులు చేస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. హయత్‌నగర్ వివేకానంద పాఠశాల నుంచి పోచమ్మ ఆలయం వరకు సీసీ రోడ్డును వేయడం జరుగుతుందన్నారు. మరో నాలుగు రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కళ్లెం శంకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రమణారెడ్డి, సాయిరాం, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

డివిజన్‌ను అభివృద్ధి చేస్తా : మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని ఆయా కాలనీలు, బస్తీలను అన్నివిధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజీలోని వైఎస్ఆర్ విగ్రహం నుంచి భగత్‌సింగ్ యువజన సంఘం భవనం వరకు జీహెచ్ఎంసీ నిధులు రూ.1.50 కోట్లతో చేపట్టిన వరదనీటి కాలువ, అదే ప్రాంతంలో రూ.60లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ శుక్రవారం పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీల్లో సీసీరోడ్లు, యూజీడీ నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, జలమండలి మేనేజర్ రమ్యభారతి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు సుంకరి రమేష్‌గౌడ్, లింగాల దశరథ్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, యోగిరాజ్, శ్రీధర్‌గౌడ్, వినోద్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీని ప్రారంభించిన ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలో గల బీసీ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం బాలాపూర్ మండలంలోని మీర్‌పేట్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై టోర్నీని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాసేపు బ్యాటింగ్ చేసి ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్‌తో పాటు ఇతర క్రీడల్లోనూ విద్యార్థులు ప్రావీణ్యం సంపాదించుకోవాలని, క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం సైతం మెరుగవుతుందని అన్నారు. క్రీడల నిర్వహణతో విద్యార్థుల్లో సమయపాలన, క్రమశిక్షణ అలవడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నాగోల్ డివిజన్ అభివృద్ధే లక్ష్యం : కార్పొరేటర్ అరుణ

మన్సూరాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చడమే తన లక్ష్యమని కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్‌కాలనీ రోడ్ నంబర్.1లో సిల్వర్‌ప్లేట్ రెస్టారెంట్ నుంచి చాణక్యపురికాలనీ వరకు రూ.22.5లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీరోడ్డు పనులను శుక్రవారం ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు కార్పొరేటర్ ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఉమేష్‌గౌడ్, బీజేపీ నాయకులు పంగ శ్రీకాంత్, పల్వాయి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

దోమలను నిర్మూలించాలి : దేవేందర్‌రెడ్డి

సైదాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వారంలో మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పాటించి, దోమలను నిర్మూలించాలని జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాయినగర్ బస్తీలో దోమల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో యూసీడీ రత్నమ్మ, సీఓ యాదయ్య, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రసాద్‌రావు, శేషగిరిరావు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులను ఖండిస్తున్నాం: అరవింద్‌రెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): హిందువుల ఆలయాలపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయత్రినగర్ బ్యాంక్ కాలనీలోని పోచమ్మ ఎల్లమ్మ ఆలయాల మండపాలను హయత్‌నగర్ తహసీల్దార్ గురువారం సాయంత్రం కూల్చివేసిన సందర్భంగా కాలనీవాసులతో కలిసి అరవింద్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం ఆలయాల ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందలాది మంది హిందువులు ఆరాధించే పోచమ్మ ఎల్లమ్మ ఆలయం వద్ద నిర్మించిన షెడ్డును అధికారులు కూల్చివేయడంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసిన సదరు తహసీల్దార్‌పై ఉన్నత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, కూల్చివేసిన షెడ్డు ప్రాంతంలో నూతన షెడ్డును నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు శివారు కాలనీల అధ్యక్షులు మనోజ్ గౌరిశెట్టి, ప్రశాంత్‌గౌడ్, శ్రీశైలం, శేఖర్, రాంబాబునాయక్, కృష్ణ పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఆటల పోటీలు



న్యాయవాదుల ఆటలపోటీలను ప్రారంభిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులకు ఆటల పోటీలు నిర్వహించారు. కుంట్లూర్‌లోని మైదానంలో క్రికెట్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో అంశాలలో పోటీలు జరిగాయి. క్రికెట్‌లో నాలుగు జట్లు తలపడ్డాయి. ఫైనల్స్‌లో రాఘవేంద్రరెడ్డి, జక్కుల విజయ్ జట్లు ఆడాయి. ఫైనల్స్‌లో రాఘవేంద్రరెడ్డి జట్టు విజయం సాధించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి కార్తీక్ బాసెట్టి పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వం వచ్చాకే సంక్షేమ పథకాలు

● ఐటీశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ఎల్బీనగర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వం వచ్చాకే సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని ఐటీశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కర్మన్‌ఘాట్‌లోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, కార్పొరేషన్ చైర్మన్లు మల్‌రెడ్డి రాంరెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, సుజాతానాయక్, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, పీసీసీ మాజీ కార్యదర్శి జక్కిడి ప్రభాకర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరు అయిన కొత్త రేషన్ కార్డులను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం ప్రజల గౌరవాన్ని పెంచే ఆలోచన చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రజల బతుకుల్లో ఏదో మార్పు వస్తుందన్న ఆశతో ఎదురు చూశారన్నారు. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం ఒక్క రేషన్ కార్డు ఇచ్చే ఆలోచన కూడా చేయలేదని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం 8 లక్షల కోట్ల వరకు అప్పులు చేసి కూర్చుంటే వాటిపై ప్రతి నెల 7వేల కోట్ల వడ్డి కట్టాల్సి వస్తోందన్నారు. అయినప్పటికీ ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకోవాలన్న ప్రయత్నంలో ఉన్నామన్నారు. ఎంత ఆర్థికభారమైనప్పటికీ ప్రభుత్వం భరించి ప్రజలకు ఒక్కపైసా ఖర్చు లేకుండా రేషన్‌కార్డు ఉన్న కుటుంబంలోని ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నదన్నారు. ప్రభుత్వం ఏమి చేస్తున్నదని అడిగే వారికి జవాబు చెప్పాల్సిన అవసరం కూడా మీపై ఉన్నదన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా వేలాది మందికి రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం అందించే కార్యక్రమం చేపట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఏమి కావాలి వారిలో ఏ మార్పు తీసుకురావాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ సన్నబియ్యం అందించాలన్న ఆలోచన చేయడం జరిగిందన్నారు. ఇల్లులేని నిరుపేదలకు ఇల్లు ఇచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. గతపదేళ్లలో ఒక్కసారి కూడా గ్రూప్ ఒన్ పరీక్షలు నిర్వహించలేదన్నారు. ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత వివిధ పరీక్షలు నిర్వహించి దాదాపు 65వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. 200 యూనిట్ల కరెంటు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. పేద వారికి భారం ఎలా తగ్గించాలన్న ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని దానికి రాష్ట్రపతి ఆమోదం ఇప్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని ఇక్కడి బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలను కోరుతున్నానన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రోడ్డుడెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న రామ్మోహన్‌గౌడ్, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్లు వేణుగోపాల్, జానకి, డీఎస్ఓ వనజాత, ఏఎస్ఓ పుల్లయ్య, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుజాత, వైకుంఠం, సూర్యప్రకాష్‌గుప్తా పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణకు కృషి

● మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకోలేకర్ లక్ష్మీశ్రీనివాస్



మార్కెట్‌లో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్, పాలకమండలి సభ్యులు

ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రైతుల సౌకర్యార్థం వ్యవసాయ మార్కెట్‌ను ఆధునికీకరించేందుకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని అనుమతులు రాగానే అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకోలేకర్ లక్ష్మీశ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మార్కెట్‌లో నెలకొన్న సమస్యలపై, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రోద్బలంతో మలక్‌పేట మార్కెట్‌ను మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామన్నారు. రైతులకు పంట అమ్మకాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు మార్కెట్‌ను అన్నివిధాల ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు పంట అమ్ముకోవడానికి వచ్చిన రైతులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, రైతులకు సులువుగా పంట ధర తెలిసేలా మార్కెట్‌లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే రూ.40లక్షలతో మార్కెట్‌లో పంట విక్రయాలు జరిపే షెడ్లకు మరమ్మతులు చేపట్టడం జరిగిందని రైతులకు విశ్రాంతి గదుల ఆధునికీకరణ, అంతర్గత సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరలోనే చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశం అనంతరం బీఓటీ పద్ధతిలో నిర్మించే సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చైర్‌పర్సన్, పాలకమండలి సభ్యులు కలిసి శంకుస్థాపన చేశారు. సమావేశంలో మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డి, వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్లు మస్రత్ సుల్తానా, నేలపాటి రామారావు, బి.సత్యనారాయణ, జగదీష్, శివాజీ, కిషన్‌సింగ్, మార్కెట్ ఉద్యోగులు పుష్ప, మాధురి, పవన్ పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు

విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలి

● రాచకొండ సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ/హయత్‌నగర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): విజబుల్ పోలీసింగ్‌తోనే ప్రజల భద్రతకు భరోసా ఉంటుందని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. విజబుల్ పోలీసింగ్‌లో భాగంగా శుక్రవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుంట్లూరు మదర్‌డెయిరీ వద్ద వాహనాలు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అత్యవసర సేవలకు డయల్ 100, సైబర్ నేరాలకు 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. లోన్‌యాప్ మోసాలు, మాదకద్రవ్యాల నిరోధం, మహిళల భద్రత, చైన్ స్నాచింగ్, రోడ్డు భద్రత, మొబైల్ దొంగతనాలతోపాటు సైబర్ నేరాలను నిరోధించే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం శివారెడ్డినగర్‌లో ఉంటున్న సీనియర్ సిటిజన్ బురగడ్డ అనంతాచార్యులు నివాసానికి వెళ్లి ఆయనతో కొంతసేపు ముచ్చటించారు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ విధులు, పెట్రోకార్, బ్లూకోల్ట్స్ పర్యవేక్షణ, ఆకస్మిక వాహన తనిఖీలు, మహిళా సిబ్బంది సైకిల్ పెట్రోలింగ్ వంటి విజబుల్ పోలీసింగ్ కార్యక్రమాల గురించి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు.

శ్రీకృష్ణుడి విగ్రహంతో మంత్రాలచెరువుకు అందం

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ప్రతినిధులు

సరూర్‌నగర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మంత్రాలచెరువు కట్టపై ఏర్పాటు చేయనున్న శ్రీకృష్ణుడి విగ్రహంతో చెరువుకు రెట్టింపు అందం చేకూరనున్నదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. కట్టపై శ్రీకృష్ణుడి విగ్రహం ప్రతిష్ఠించనున్న యాదవ సంఘం ప్రతినిధులు, ప్రతిష్ఠాపన కమిటీ సభ్యులు శుక్రవారం ఆమెను శ్రీనగర్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయింపజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే జిల్లెలగూడ చందచెరువు కట్టపై అనేక మంది మహనీయుల విగ్రహాలు కొలువుదీరాయని, తాజాగా మంత్రాలచెరువు కట్టమీద సైతం విగ్రహాలు ఏర్పాటు చేయడానికి పలు సంఘాలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఈ కట్టపై కామధేనుసహిత శ్రీకృష్ణ భగవానుడి విగ్రహం ఏర్పాటు చేయాలని యాదవ సంఘం పెద్దలు నిర్ణయించుకోవడం అభినందించదగ్గ విషయమని, దానికి తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ సభ్యులు జెనిగె జంగయ్యయాదవ్, బి.కాశీరామ్‌యాదవ్, ఎనుగుల అనిల్‌కుమార్‌యాదవ్, గోపీయాదవ్, నాగేశ్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, నర్సింగ్‌రావుయాదవ్, యాదగిరియాదవ్, నర్సింహయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, మహేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బుడగ జంగాలు



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న బేడ బుడగ జంగం నాయకులు

హయత్‌నగర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు బేడ, బుడగ జంగాల సభ్యులు శుక్రవారం హయత్‌నగర్‌లోని మహాగాయత్రినగర్‌లో ఎం. పరమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వంలోకి రానుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, తూర్పాటి చిన్నకోటయ్య, శ్రీనివాసులు, కోటయ్య, వెంకటేష్, యాదగిరి, సత్యనారాయణ, రామస్వామి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, మల్లీశ్వరీ, భాస్కర్‌సాగర్, మల్లేష్ పాల్గొన్నారు.

మూసారాంబాగ్‌లో శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్



శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో జీహెచ్ఎంసీ యూబీడీ అడిషనల్ కమిషనర్ సుభద్రదేవి, డీసీ ఎంకేఐ అలీ, ఏఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ తదితరులు

చాదర్‌ఘాట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలు, మట్టికుప్పలు, చెట్లకొమ్మల తొలగింపు కోసం జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 డీసీ ఎంకేఐ అలీ పర్యవేక్షణలో శుక్రవారం శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. యూబీడీ అడిషనల్ కమిషనర్ సుభద్రదేవి శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా పరిసరాల పరిశుభ్రత కు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకరించాలని ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఇంట్లోని చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాల్లో పారవేయకుండా ఇంటింటికీ వచ్చి చెత్తను సేకరించే స్వచ్ఛ ఆటోను సిబ్బందికి అందజేయాలన్నారు. డివిజన్‌లోని మూసారాంబాగ్ నుంచి అంబర్‌పేటకు వెళ్లే మెయిన్‌రోడ్డు, ఎస్‌బీఐ ఆఫీసర్స్‌కాలనీ, శాలివాహననగర్ కాలనీల్లోని మట్టికుప్పలు, చెత్తకుప్పలను తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు ఏఎంహెచ్‌వో డాక్టర్ రుద్ర శ్రీనివాస్ తెలిపారు. నాలుగు లారీల ద్వారా 5 మెట్రిక్ టన్నుల చెత్త, మట్టి కుప్పలను తొలగించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునంద, డిప్యూటీ డైరెక్టర్ విష్ణువర్ధన్, మేనేజర్ కిరణ్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ గజానంద్, సెక్షన్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, ఎంటమాలజిస్ట్ ఏఈ ఎం. శ్రీనివాస్, శానిటేషన్ సూపర్‌వైజర్ సురేష్, ఇంజనీరింగ్ విభాగం ఏఈ శరత్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. 30మంది శానిటేషన్ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.



మాట్లాడుతున్న కాసం వెంకటేశ్వర్లు, పక్కన వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి

ఓబీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

మన్సూరాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీసీలను మోసం చేస్తోందని, ఈ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నేడు(శనివారం) నగరంలోని ధర్నాచౌక్ వద్ద రాష్ట్ర ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో చేపట్టే నిరసనను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మన్సూరాబాద్‌లోని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులచే సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓబీసీ వర్గాల సంక్షేమానికి అంకితభావంతో పనిచేసే ఏకైక పార్టీ బీజేపీయేనని, రానున్న కాలంలో ఓబీసీల హక్కుల కోసం మరింత పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కళ్లెం రవీందర్‌రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షులు మునగాల హరీష్‌రెడ్డి, పోరెడ్డి రవీందర్‌రెడ్డి, ఎరుకల మల్లేష్‌గౌడ్, క్రాంతిగౌడ్, గుండె కిరణ్‌కుమార్, జయప్రకాశ్‌కుమార్, పంగ శ్రీకాంత్, నాయకులు నందికొండ గీతారెడ్డి, చల్ల గీతారెడ్డి, పద్మారెడ్డి, షకీల్ మీర్జా పాల్గొన్నారు.



సీఐ రవికుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

సీఐకి సన్మానం

హయత్‌నగర్ : బదిలీపై వచ్చిన ఆదిబట్ల సీఐ రవికుమార్‌ను శుక్రవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన పలువురు బీజేపీ నాయకులు కలిశారు. అనంతరం శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు బచ్చిగళ్ల రమేష్, గంట ప్రభాకర్‌రెడ్డి, నందగిరి సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

పేదల హక్కుల కోసం ప్రశ్నించే గొంతుక సీపీఐ

● రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా పేదల హక్కుల కోసం ప్రశ్నించే గొంతుక సీపీఐ ఒక్కటే అని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. శుక్రవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ ఆర్ఎన్ఆర్‌కాలనీ పార్టీ కార్యాలయంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల సమితి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం రోడ్డు ఎక్కి ధర్నాలు, ఆందోళనలు చేసేది కమ్యూనిస్టులే అన్నారు. ఈ సందర్భంగా మండల సమితి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు.

సీపీఐ కార్యదర్శిగా హరిసింగ్‌నాయక్

అబ్దుల్లాపూర్‌మెట్ మండల సమితి సీపీఐ నూతన కార్యదర్శిగా అజ్మీర్ హరిసింగ్‌నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రవీంద్రాచారి, యాదిరెడ్డి ప్రకటించారు. సహాయ కార్యదర్శిగా కేతరాజు నరసింహతో పాటు కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు, మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొంతం మాధవరెడ్డి, వేణుగోపాల్‌చారి, అరుణ, నవనీత, మధు, నరసింహ, ప్రసాద్, వెంకన్న, శేఖర్, నారాయణరెడ్డి, పుల్లయ్య, రాజు, రాములు పాల్గొన్నారు.

వర్షపునీరు కాదు.. తాగునీళ్లు



దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో పారుతున్న తాగునీరు

హైదరాబాద్ సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి) : దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో భారీగా వరద పోతుంది. అదంతా వర్షపు నీరు అనుకుంటే భ్రమపడినట్లే..! వాటర్‌బోర్డు నగరవాసులకు సరఫరా చేసే తాగునీరు. ఓ వైపు మెట్రోస్టేషన్, మరో వైపు బస్టాప్, ఇంకో వైపు కోణార్క్ థియేటర్ వైపు వెళ్లే ఈ మూడు రోడ్ల కూడలి నుంచి ఎవరు నడుస్తు వెళ్లిన కానీ నీళ్లలో నుంచి వెళ్లాల్సిందే..! ఎంతో స్వచ్ఛంగా ఉన్న ఆ నీటిలో కాళ్లను కడుకోకుండా ఉండలేరు. రెండో రోజులుగా వర్షపు నీటి వరద వెళ్లినట్లుగా వెళ్తుంది. అక్కడి వాటర్‌బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదు. స్థానిక ట్రాఫిక్ పోలీసులు కూడా వాటర్‌బోర్డు అధికారులకు సమాచారం అందించారంటా..! పైపులైన్ లీకేజీతో నీళ్లన్నీ పెద్దఎత్తున వృథాగా పోతున్నాయని గురువారమే చెప్పారట. కానీ శుక్రవారం రాత్రి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ విషయాన్ని వాటర్‌బోర్డు స్థానిక జీఎం దృష్టికి తీసుకొచ్చేందుకు ఫోన్ సంప్రదించిన కానీ ఎత్తడం లేదు. వాటర్‌బోర్డులో ఆన్‌లైన్ సేవలు స్తంభించిన నేపథ్యంలో వాట్సాప్, కాల్స్‌లతో ప్రజలకు అందుబాటులో ఉండాలని శుక్రవారం ఉదయమే ఎండీ ఆదేశాలిచ్చిన కానీ కిందిస్థాయి అధికారులు పట్టించుకోకుండా ఉన్నారనడానికి ఇదో నిదర్శనంగా నిలుస్తుంది.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాల నియంత్రణ



మాట్లాడుతున్న టీటీఐ ఎస్ఐ నర్సింహారావు

కొత్తపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నియంత్రణ సాధ్యమని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి తెలిపారు. శుక్రవారం ఎల్బీనగర్‌లోని ఓ అకాడమీ నుండి 63మంది ఇంటర్, డిగ్రీ విద్యార్థులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. వారికి రెండు విడతల్లో లెక్చర్ హాల్‌లో ప్రమాదాల తీరుకు అద్దం పట్టే వీడియోలు, నిబంధనల ప్రాధాన్యతను సూచించే చిత్రాలనూ ప్రదర్శిస్తూ నిబంధనలపై టీటీఐ ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి, ఏఎస్ఐ సోమ్‌నాథ్ అవగాహన కల్పించారు. విద్యార్థులు పార్కులో లోపలి గోడలపై ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నిబంధనల కార్టూన్ బొమ్మలను చూసి, ప్రమాదాల నివారణ సూచనలను గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. హెల్మెట్ సీటు బెల్టు పెట్టుకోవడంలో జాగ్రత్తలు గుర్తు చేశారు. సిబ్బంది రమేష్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్ నిబంధనల వీడియోలను ప్రదర్శించారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో 11 కార్యక్రమాలు

రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్, కర్మన్‌ఘాట్, కొత్తపేటలలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో 11 కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో 456 మంది విద్యార్థులకు ఎస్ఐ నర్సింహారావు, ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్ రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతలపై అవగాహన కల్పించారు. పాఠశాలల్లో విద్యార్థులకు నిబంధనలు పరిచయం చేయడంతో పాటు నిబంధనలు, సూచనలున్న కరపత్రాలూ, ఏబీసీ ఆఫ్ రోడ్ సేఫ్టీ ఫర్ చిల్డ్రన్ బుక్‌లెట్స్ పంపిణీ చేశారు.

39 మంది మద్యంప్రియులకు డీడీ కౌన్సిలింగ్

పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యంతాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 39 మంది మద్యంప్రియులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో టీటీఐ లెక్చర్ హాల్‌లో శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. మద్యంమత్తులో వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి, ఏఎస్ఐ సోమ్‌నాథ్ వారికి వివరించారు.